www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 28 డిసెంబర్ 2023

ఉపాధ్యాయుల 6 గంటల ధర్నా

ఏలూరులో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేతలు

6లో..

'సాగు'కు రుణమేదీ..!

కౌలు రైతులకు రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం

రెండు జిల్లాల వ్యవసాయ రుణ ప్రణాళిక సుమారు రూ.8 వేల కోట్లు

2023-24లో మంజూరు చేసిన రుణం రూ.424 కోట్లే

3 లక్షల మంది కౌలు రైతులుండగా లక్షా 46 వేల మందికే కౌలు కార్డులు

కౌలు కార్డుదారుల్లోనూ సగం మందికే రుణం

రబీ సాగులోనైనా రుణాలివ్వాలని కౌలురైతుల వేడుకోలు

'సాగు చేసే రైతును పక్కన పెట్టేశారు. ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఆసరా లేకుండాపోయింది. గడిచిన రబీ, ప్రస్తుత ఖరీఫ్‌లోనూ వర్షాలకు పంట నష్టపోయిన కౌలురైతులకు ప్రభుత్వ అండ లేకుండాపోయింది. సాగు చేసే రైతులకు పంట రుణాలు కూడా ఇవ్వని దుస్థితి నెలకొంది. 2023-24లో రెండు జిల్లాల్లోనూ కౌలు రైతులకు ఇచ్చిన రుణాలు, వ్యవసాయ రుణ ప్రణాళికకు ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. రబీలోనైనా పంట రుణాలిచ్చి ఆదుకోవాలంటూ కౌలురైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలు రైతులు ఉన్నట్లు గతంలో అధికారులు రూపొందించిన లెక్కలే చెబుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలోని వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను మాత్రం ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. బ్యాంకుల నుంచి పంట రుణాల మంజూరులో ప్రభుత్వం తీవ్రంగా విఫలమవుతోంది. బ్యాంకర్ల ప్రతి సమావేశంలో కౌలురైతులకు విరివిగా పంట రుణాలు ఇవ్వాలంటూ ప్రకటనలతోనే సరిపెడుతున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి విరుద్ధంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మంది కౌలురైతులకు సిసిఆర్‌సి (రుణార్హత కార్డులు) మంజూరు చేశారు. ఇప్పటి వరకూ 40 వేల మంది సిసిఆర్ కార్డుదారులకు రూ.297 కోట్లు రుణం మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో 57 వేల వరకూ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేశారు. రుణాల మంజూరు మాత్రం 32,948 మంది కౌలుకార్డుదారులకు రూ.127 కోట్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాలవ్యాప్తంగా మూడు లక్షల మంది వరకూ కౌలుదారులు ఉండగా సిసిఆర్‌సి అందుకున్న రైతులు లక్షా 46 వేలు మాత్రమే. దాదాపు మరో లక్షా 50 వేల మందికి కౌలుకార్డులు అందనే లేదు. ఈ ఏడాది లక్షా 46 వేల మందికి కౌలుకార్డులు ఇచ్చినప్పటికీ రుణాలు అందుకున్న రైతులు మాత్రం 73 వేల మంది మాత్రమే. అదీ రెండు జిల్లాల్లోనూ కలిపి రూ.424 కోట్లు మాత్రమే. రెండు జిల్లాల వ్యవసాయ రుణ ప్రణాళిక దాదాపు రూ.ఎనిమిది వేల కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో కౌలురైతులకు పంట రుణాల కింద మంజూరు చేసిన రుణం ఒక్క శాతం కూడా లేకుండాపోయింది. కౌలుకార్డులు అందుకున్న రైతుల్లోనూ సగం మందికి పంటరుణాలు అందనేలేదు. గడిచిన రబీ, ప్రస్తుత ఖరీఫ్‌లోనూ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖర్చులు పెరిగిపోయి తీవ్ర నష్టాలను చవిచూశారు. సాగు చేస్తున్న కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం పంటరుణాలు ఇవ్వడం లేదు. సాగు చేయని భూయజమానులకు పంటరుణాలు ఇస్తున్న పరిస్థితి ఉంది.

పంట నష్ట పరిహారం, బీమా సైతం భూయజమానికే

దెబ్బతిన్న పంటలకు సంబంధించిన నష్ట పరిహారం, బీమా సైతం కౌలురైతులకు అందడం లేదు. భూయజమాని ఖాతాలోకే చేరుతున్నాయి. ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు చేసిన పరిస్థితి నెలకొంది. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లే ఉన్నాయి. దీంతో పంట నష్టపరిహారం సైతం భూయజమానికే వెళ్తోంది. బ్యాంకులో పంటరుణం తీసుకున్న రైతులకే బీమా పరిహారం చేరుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట నష్టం, బీమాపరిహారంతోపాటు రబీలోనైనా పంటరుణాలు అందించి ఆదుకోవాలని కౌలురైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన

రెండో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె - ఏలూరులో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు)రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య విమర్శించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు రెండో రోజు సమ్మె సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద నుండి బిర్లా భవన్ సెంటర్, మెయిన్ బజార్, గడియారం సెంటర్, పెద్ద పోస్టాఫీసు, పెరుగు చెట్టు సెంటర్, వైఎంహెచ్ఎ హాలు మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రజానీకానికి ఎంతో విలువైన ఆరోగ్యకర సేవలందిస్తున్నారని, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని, పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, భూగర్భ డ్రెయినేజీ, పార్కులు తదితర సేవలతో పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారన్నారు. ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు స్వచ్ఛభారత్ అవార్డులు తీసుకుంటున్నాయంటే దానికి కారణం మున్సిపల్ కార్మికుల శ్రమ అని ఆయన తెలిపారు. అలాంటి మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల సిఎం జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు 2019 ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలకు అనుగుణంగా వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనమివ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 29వ తేదీ నుండి అత్యవసర సేవలైన మంచినీటి సరఫరా, భూగర్భ డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర సేవలను నిలిపివేస్తామని దానికి ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు లేవని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ లేవని, నైపుణ్యం గల పనులు చేస్తున్నప్పటికీ అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారని, పారిశుద్ధ్య కార్మికులకు కనీసం చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనెలు, యూనిఫారాలు కూడా ఇవ్వడం లేదన్నారు.

ఏలూరులో..

నూజివీడులో..

మున్సిపల్ కార్మికులు పనులు చేయడానికి కావాల్సిన పనిముట్లు కూడా అందుబాటులో లేవని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బంగారు వెంకటేశ్వర్లు, ఆముదాల ఏసురత్నం, పంతం చిన్న నాగరాజు, బండి రాజు, అల్లం హనుమంతరావు, వినుకొండ రమేష్, కె.సాంబశివరావు, మహిళా కార్మిక నాయకులు మేతర పాప, బండి భవాని, నక్క భాగ్యలక్ష్మి, లావేటి లక్ష్మి, రమణమ్మ శివకొండ, లీలావతి, కాంతమ్మ నాయకత్వం వహించారు.

ఏలూరు టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మెకు చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగొట్టు వెంకటకృష్ణారావు మద్దతు తెలిపారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు సిఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక నగరపంచాయతీ వద్ద జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కష్టపడితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారనే విషయం ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కమలకుమారి, పద్మ, పుష్ప పాల్గొన్నారు.

నూజివీడు : పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, రజని, రాజీ, జయరాం, చిన్నారి, ఏడుకొండలు, చంద్రశేఖర్, గాంధీ పాల్గొన్నారు.

ఎనిమిదో రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ యుటిఎఫ్ మద్దతుగా ఉంటుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్ అన్నారు. ఉద్యోగుల సమ్మెలో భాగంగా బుధవారం ఎనిమిదో రోజు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముస్తఫా ఆలీ, రవికుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఎనిమిది రోజులుగా పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనమూ లేదని, ఉద్యోగుల కనీస అవసరాలు తీర్చలేని స్థితిలో ప్రభుత్వాలున్నాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ నియంతృత్వ పోకడకు బుద్ధిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా ఉద్యోగులు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యలు ఎజెండగా ఏ పార్టీ అయితే ముందుకు వస్తుందో ఆ పార్టీకే మద్దతివ్వాలని తెలిపారు. ఓట్ ఫర్ రెగ్యులర్ నినాదంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. టీచర్లు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పనులు చేయకుండా తాము చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.రాజు, కె.కమలాకర్, వి.కేశవరావు, వెంకటలక్ష్మి, సుగుణ, కుమారి, రజిని పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్నఉద్యోగులు

రెండు నెలల్లో అత్యాధునిక ఎమర్జెన్సీ వార్డు

సర్వజన ప్రభుత్వాసుపత్రి తనిఖీలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎనిమిది పడకలతో కూడిన అత్యాధునిక ఎమర్జెన్సీ వార్డును రెండు నెలల్లో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రయివేటు ఆసుపత్రులకు దీటుగా ఎమర్జెన్సీ వార్డును ఆధునీకీకరిస్తామని, కొత్త బెడ్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో బుధవారం నర్సింగ్ కెపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కలెక్టర్ ప్రభుత్వాసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి వెలుపల ప్రాంతాన్ని పరిశీలించారు. క్యాజువాలిటీ వార్డులో రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎన్ని వార్డులున్నాయి, ఎంతమంది వైద్య సిబ్బంది ఉన్నారు తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. తొలుత క్యాజువాలిటీ వార్డు, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యానికి ఇంకా ఏం చర్యలు తీసుకోవాలో డ్యూటీలో ఉన్న డాక్టర్లను ఆరా తీశారు. డ్యూటీ డాక్టర్ మొబినా మాట్లాడుతూ క్యాజువాలిటీ వార్డులో ఆక్సిజన్, మోనిటర్‌తో కలిగిన మూడు బెడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ ఆరా తీశారు. డాక్టర్లు వచ్చి చూస్తున్నారా, ఏ సమయానికి వస్తున్నారు అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రి పరిశీలించిన పిమ్మట కొన్ని అభివృద్ధి చేయాల్సిన అంశాలు, అవసరాలను గుర్తించామన్నారు. ఆ మేరకు కొత్త బెడ్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉండేలా చూడటంతోపాటు ముఖ్యంగా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్‌పై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎనిమిది బెడ్లతో కూడిన ప్రత్యేక వార్డును అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తూ కేసులు పెరుగుతున్నాయని భావిస్తే అవసరమైన చర్యలు చేపడతామన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి మాస్కులు ధరించడం, శానిటేషన్ చేసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఉన్నారు.

రోగుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

బాలోత్సవం విజేతలకు నేడు బహుమతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హేలాపురి బాలోత్సవం-4లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 28వ తేదీన బహుమతుల ప్రధానం చేయనున్నారు. ఈ మేరకు బాలోత్సవ కమిటీ స్థానిక సిఆర్ రెడ్డి ఆడిటోరియంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 23, 24 తేదీలలో స్థానిక అమీనాపేటలోని సురేంద్ర బహుగుణ స్కూల్ షేక్ సాబ్జీ స్మారక ప్రాంగణంలో బాలోత్సవం ఉత్తేజభరితంగా సాగింది. వివిధ పాఠశాలల విద్యార్థులు సుమారు ఏడు వేల మంది వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఇఒ శ్యామ్‌సుందర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, సెట్ వెల్ సిఇఒ మెహర్రాజ్, పలువురు అధికారులు పాల్గొనున్నారు.

29న ఆగిరిపల్లిలో స్పందన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈనెల 29వ తేదీన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ఆగిరిపల్లిలోని పొన్నం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎం.ఉదయభాస్కర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఇతర జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని, మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్ఎ సారూ.. మా గోడు వినరూ..!

ఎంఎల్ఎ కార్యాలయాల ముట్టడి - పలుచోట్ల ఉద్రిక్తత - వినతుల స్వీకరణకూ రాని పరిస్థితి - 16వ రోజుకు అంగన్వాడీల సమ్మె



కైకలూరులో..

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో అంగన్‌వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. సమ్మె 16వ రోజు సోమవారం ఎంఎల్ఎ కార్యాలయాలను ముట్టడించారు. ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా ఎంఎల్ఎలకు వినతులు అందించారు. పలుచోట్ల ఎంఎల్ఎలు అందుబాటులో లేకపోవడంతో వారు వచ్చేవరకూ ఆందోళన చేపట్టారు.

ఏలూరు అర్బన్ : అంగన్వాడీలు 16వ రోజు సమ్మెలో భాగంగా ఎంఎల్ఎ ఆళ్ల నాని ఇంటి వద్ద తమ నిరసన తెలిపారు. స్థానిక సెయింట్ థెరిస్సా డిగ్రీ కాలేజ్ నుండి ఎంఎల్ఎ ఇంటి వరకూ ర్యాలీగా వెళ్లిన అంగన్వాడీలు ఎంఎల్ఎ ఇంటి వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు దాటుకుని ఇంటి ముట్టడికి ప్రయత్నించారు. ఎంఎల్ఎ బయటకు రావాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయితే పోలీసు అధికారులు నచ్చచెప్పడంతో అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. అంగన్వాడీలు అడుగుతున్న న్యాయమైన కోర్కెలు పరిష్కరించకుండా ఈ ప్రభుత్వం పోలీసులతో ఉద్యమాలను అణచాలని చూడటం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎంఎల్ఎ కార్యాలయం నుంచి మెడికల్ బోర్డు సభ్యులు దిరిశాల వరప్రసాద్ వచ్చి వినతిపత్రం తీసుకోవడంతో, అక్కడ నుంచి తిరిగి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి మాట్లాడుతూ నాలుగుసార్లు చర్చలు జరిపినా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. చర్చల పేరుతో పిలిచి ప్రభుత్వం అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ సిఎంకు అంగన్వాడీల బాధలు తెలియలేదని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. యూనియన్ అధ్యక్షులు టి.రజని, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, పి.హైమావతి, స్వప్న, మల్లిక, అరుణకుమారి, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధ.రావు, సాయిబాబు పాల్గొన్నారు. అంగన్వాడీల సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్షులు ఆలీ మద్దతు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : పట్టణ, మండలంలోని అంగన్వాడీలు ఎంఎల్ఎ కార్యాలయాన్ని ముట్టడించారు. అయితే ఎంఎల్ఎ ఎలిజా స్పందించకపోవడంతో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.



జంగారెడ్డిగూడెంలో..

ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్‌కె.సుభాషిణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు కూడా వినే పరిస్థితిలో ఎంఎల్ఎ ఉండటం దారుణమన్నారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ సమస్యకు తనకు సంబంధం లేదని, సిఎం జగన్ చూసుకుంటారని నిర్లక్ష్యంగా మాట్లాడటం బాధాకరమన్నారు.

నూజివీడు రూరల్ : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు వినతిపత్రం అందించారు. కనీస వేతనాలు చెల్లించి అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం దృష్టికి ఈ సమస్యలను తీసుకెళతానన్నారు. అంగన్వాడీల డిమాండ్ల సాధనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, ఎన్ఆర్.హనుమాన్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నిడమర్రు : ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మె కొనసాగిస్తామని మండలంలోని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 16వ రోజు సమ్మెలో భాగంగా ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల అంగన్వాడీలు తరలివచ్చారు. భీమడోలు ఐసిడిఎస్ ప్రాజెక్టు నాయకురాలు వి.స్వర్ణకుమారి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా అంగన్వాడీల యూనియన్ అధ్యక్షురాలు కె.ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి బెదిరించడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో. జె.రత్నకుమారి, రామకోటి. వై.సుజాత, కె.జయమ్మ, ఎన్.పార్వతి. ఎస్.ధనలక్ష్మి. ఎం.నాగేశ్వరి, కె.కనకమహాలక్ష్మి, రాజమణి, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

ఏలూరులో..

బుట్టాయగూడెం : అంగన్వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. 16వ రోజు పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, సిఐటియు సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీలు విధులు బహిష్కరించి 16 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ సమ్మె విరమించేది లేదన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని, అంగన్వాడీల పట్ల మంత్రి బొత్స సత్యనారాయణ తీరు దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, గ్రాడ్యుటీ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. వెంకట్రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, జిల్లా నాయకులు కొండలరావు, కె.పుష్ప, రామలక్ష్మి, ఏస్తేరు, శివరత్నకుమారి, పద్మజ, సరస్వతి, మణి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలని అంగన్వాడీలు ఎంఎల్ఎ బాలరాజు ఇంటి ముట్టడికి తరలివెళ్లారు. ఎంఎల్ఎ ఇంటివద్ద లేకపోవడంతో కొద్దిసేపు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, సిపిఎం బుట్టాయగూడెం మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు నాగమణి, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్వాడీల నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీలు భువనపల్లిలోని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని సమర్పించారు. నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాలకు చెందిన అంగన్వాడీలతోపాటు సిపిఎం, వివిధ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని అంగన్వాడీలు ఫైర్‌స్టేషన్ సెంటర్ నుండి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వరకూ ర్యాలీగా చేరుకుని ముట్టడించారు. అనంతరం అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. ఎంఎల్ఎ అందుబాటులో లేకపోవడంతో పార్టీ కార్యాలయానికి రావాలని నినాదాలు చేశారు. ఎంతసేపటికీ ఆయన రాకపోవడంతో ఎంఎల్ఎ పిఎకు వినతిని అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ నాయకులు మాణిక్యం మాట్లడూతూ వారి న్యాయమైన డిమాండ్లు తక్షణం పరిష్కరించాలని కోరారు. అనంతరం గోద్రేజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కార్మికులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, ప్రాజెక్టు అధ్యక్షులు సరోజని, సరళ, కవిత పాల్గొన్నారు.



నూజివీడులో..

కైకలూరు : అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో తాలూకా సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి ఎంఎల్ఎ నివాసాన్ని ముట్టడించారు. అనంతరం ఎంఎల్ఎకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇప్పటికి అంగన్వాడీల నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని, త్వరలో సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు.

ముసునూరు : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేముల బక్కయ్య డిమాండ్ డిమాండ్ చేశారు. 16వ రోజు అంగన్వాడీల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు పల్లి పాము భవాని, ఆముదాల సురేష్, శ్యామల, అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరికి వినతిని అందిస్తున్న అంగన్వాడీలు

ముదినేపల్లి : అంగన్వాడీలు విధులు బహిష్కరించి 16వ రోజూ సమ్మెలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు అరుణ, పద్మ, రిబ్కా, మణి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 16వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు కోలాటం ఆడుతూ తమ నిరసన తెలిపారు. అంగన్వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడు రమాదేవి, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని అంగన్వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. 'భగభగ మండే సూర్యుడిని చూడు అంగన్వాడీల సత్తా చూడు.. మాట ఇచ్చాడు జగనన్న.. మాట మరిచాడు జగనన్న.. అంటూ డాన్స్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమలత, జ్యోతిరాణి, హేమలత, సిఐటియు మండల నాయకులు మేడిపల్లి మేరీ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

వీఆర్ఏ గ్రేడ్-2 సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వీఆర్ఏ గ్రేడ్-2 సమస్యలు పరిష్కరించమని కోరుతూ బుధవారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయంలో సిసిఎల్ఎ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయి ప్రసాద్, అడిషనల్ జాయింట్ సెక్రెటరీ ఇంతియాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మధ్యకాలంలో సర్వే సప్లిమెంటరీ ఎగ్జామ్స్ రిజల్ట్‌లో సుమారు 650 మంది పాస్ అవ్వడం జరిగిందన్నారు. జిఒ నెంబర్ 13 ప్రకారం సిపిటి, సర్వే ఎగ్జామ్ తప్పనిసరిగా పాస్ కావాలని నిబంధనలు ఉన్నందున ఈ రెండు పాస్ కావడానికి ఒక సంవత్సరం గడువు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయి ప్రసాద్, అడిషనల్ జాయింట్ సెక్రెటరీ ఇంతియాజ్ అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి నళిని కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రజా వ్యతిరేక చట్టాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి హక్కులు కాపాడుకోవాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్స్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహారదీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. బుధవారం దీక్షలో ఉపాధ్యక్షులు తల్లాడి అశోక్ కుమార్, కార్యదర్శి ఎవివి.భువనేశ్వర్, మేకల రామ మోహనరావు, సోసల రవిధర్మరాజు, ఓగిరాల సువర్ణ రత్న కుమార్, ఇనుమల శ్రీనివాస్ పాల్గొన్నారు. జనసేన నాయకులు చిర్రి బాలరాజు, మేక ఈశ్వరయ్య, గడ్డ మణుగ రవికుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలో ప్రజా వ్యతిరేక భూ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూములను దోచుకునేందుకు ఈ చట్టాలను చేపట్టిందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపి ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల భూములను హరించే విధంగా ఉందని, దీని వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోయినట్లయితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ప్రకాష్, సెక్రెటరీ మదుపల్లి మధు రవిశంకర్, సీనియర్ అడ్వకేట్ గోళ్లప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక ల్యాండ్ టైటిల్ చట్టాన్ని వ్యతిరేకించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గంగిరెడ్డి మేఘలాదేవి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రమైన జంగారెడ్డిగూడెం పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్ష శిబిరం వద్దకు వెళ్లి బుధవారం మేఘలాదేవి లాయర్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం పట్టణ మహిళా అధ్యక్షులు దొడ్డపనేని దుర్గాదేవి, జాన్సీ రాణి, కొత్త రమ, మంగతాయారు, ధనలక్ష్మి, లాయర్లు ఓగిరాల రత్నకుమార్, తల్లాడ అశోక్ కుమార్, భువనేశ్వర్, మేకల రామమోహనరావు పాల్గొన్నారు.

లైసెన్సుల రెన్యువల్‌కు దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు : జిల్లాలో గ్రామపంచాయతీల పరిధిలోని ఆర్కిటెక్ట్, ఇంజినీర్, సర్వేయర్-1, సర్వేయర్-2లకు లైసెన్సుల టెక్నికల్ పర్సనల్(ఎల్‌టిపి) కొత్త లైసెన్సులు జారీచేయుట, పాత లైసెన్సుల రెన్యువల్ చేయుట జరుగునని జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాధ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను ఉచితంగా పొందవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను డిమాండ్ డ్రాఫ్టులతో ఈనెల 30వ తేదీ లోపు జిల్లా గ్రామపంచాయతీ అధికారి కార్యాలయంలో స్వీకరించబడునన్నారు. ఇది కేవలం లైసెన్స్ నిమిత్తం జారీచేయబడినది, ఉద్యోగ ప్రకటన కాదని అభ్యర్థులు గమనించగలరన్నారు. మరిన్ని వివరాలకు 9182327008, 9848582395 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

బొర్రంపాలెంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ

టి.నరసాపురం : క్రిస్మస్ ఆనందం పేరుతో గత మూడు రోజులుగా మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఫిష్ ద పీపుల్, యూత్ ఆధ్వర్యంలో సామాజిక వేత్త కలపర్తి విజయ్ వృద్ధులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రిస్మస్ ఆనందాన్ని పురస్కరించుకుని పేదలు, వృద్ధులకు దుప్పట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తున్నామని, ఆక్రమంలోనే గత మూడు రోజులుగా గ్రామంలోని వృద్ధుల ఇంటికి వెళ్లి క్రిస్మస్ తాత వేషంలో పంపిణీ చేస్తున్నామన్నారు. మూడురోజుల్లో సుమారు రూ.30 వేల విలువైన రగ్గులు, పండ్లు బ్లాకెట్లు 70 మందికి అందించామన్నారు. పేదల్లో సంతోషాన్ని నింపేందుకు క్రిస్మస్ ఆనందాన్ని పంచామన్నారు. ఈ కార్యక్రమంలో గుట్ట సురేష్, అశోక్, మోషే, నాగేంద్ర పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

నూజివీడు రూరల్ : నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ ఆదేశం, రూరల్ సిఐ బాల సురేష్ ఉత్తర్వులతో నిబంధనలు పంచాలని నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. బహిరంగ వేడుకలకు అనుమతి తీసుకోవాలని తెలియజేశారు.

పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

ముసునూరు : పదో తరగతి విద్యార్థులు చదువులో మంచి ప్రావీణ్యత సంపాదించి, ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వైస్ ఎంపిపి పామల గంగాధరరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 'జగనన్న స్ఫూర్తి భవిత భరోసా' కార్యక్రమంలో భాగంగా స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కంచర్ల వాణి, ప్రధానోపాధ్యాయులు ఎల్.వి.ఎస్.నాగేంద్రరావు, బాబురావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

అర్ధరాత్రి ఫ్లడ్ లైట్ వెలుగులో కోడిపందేల స్థావరంపై దాడి చేసినట్లు చింతలపూడి ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఫ్లడ్ లైట్లు పెట్టుకుని కోడిపందాలు నిర్వహిస్తుండగా దాడులు చేసి నాలుగు కోడిపుంజులు, 10 మోటార్ సైకిళ్లు, రూ.2.280 నగదు, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీ కొని ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీపురం సెంటర్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట గ్రామానికి చెందిన పి.వెంకటేష్ ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వైపు వెళ్తూ లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద బుధవారం ఎస్ఇబి ఎస్ఐ ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా రాష్ట్రం నుంచి ఆంధ్రాకు తరలిస్తున్న 5 ఫుల్ బాటిళ్లను పట్టుకోవడం జరిగిందన్నారు. దీంతో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ప్రవీణ్, శ్యామ్ ఉన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ధర్నా నిర్వహిస్తున్న వ్యకాస నాయకులు

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ధర్నా

ఏలూరు అర్బన్ : అసైన్డ్, సీలింగ్ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్, సీలింగ్, గయాల వేలాది ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. టి.నరసాపురం మండలం వేపుకుంట పంచాయతీ పరిధిలో గుర్వాయగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 88/1, 88/2లో సుమారు 30 ఎకరాలు రామమ్మగూడెం గిరిజనులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములపై గిరిజనేతరులు చింతలపూడి, ఏలూరు కోర్టుల్లో అక్రమ కేసులు గిరిజనులపై బనాయించి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంత కాలం ఏలూరు ఆర్‌డిఒ కోర్టులో ఈ కేసు నడిచిందని, కేసు పెండింగ్‌లో ఉండగానే గిరిజనేతర భూస్వాములు హైకోర్టు నుండి ఆర్డర్ తెచ్చుకుని పంటను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. 25 ఏళ్లలో ఎన్నడూ లేని భూస్వాములు దొంగపత్రాలు సృష్టించి కోర్టులను, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి గిరిజనుల భూములను లాగేసుకోవాలని చూస్తున్నారని ఏద్దేవా చేశారు. టి.నరసాపురం మండలంలో కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో 83/2 సర్వే నెంబర్‌లోని 6.61 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికేతర భూస్వాములు అక్రమంగా అనుభవిస్తున్నప్పటికీ మండల రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. దళితులకు, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూపోరాట నాయకులు అనుమోలు మురళీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మడకం సుధారాణి, పూసం సూర్యారావు, ముత్యాలమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

'అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం లేదు'

భీమడోలు : ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా వెలుగు చూసిన అంశాలపై అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం లేదని, అవే తుది నిర్ణయాలని విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ జిల్లా అధికారి వివి.విజయలక్ష్మి తెలిపారు. మండలంలో 2022-23లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక వచ్చేనెల 12వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారి బాధ్యులతో సమన్వయ సమావేశం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వం దీన్ని రద్దుచేసి మండలస్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపిందన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో యువకులు సత్తా చాటాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఆడుదాం ఆంధ్రా ఆటలో ప్రతి ఒక్క యువకుడు పాల్గొని ఉత్సాహంతో తన సత్తా చాటాలని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటలను సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, ఎంపిపి కొండా దుర్గా భవాని వెంకట్రావు పలువురు నాయకులతో కలిసి యువకులు ఆటల్లో ఎలా ప్రతిభ కనబరచాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని బుధవారం బయ్యనగూడెంలో ప్రారంభించారు. ఈ కార్యమంలో కీర్తిశేషులు పారిశ్రామికవేత్త పోతన శేషగిరిరావు పేరిట కుమారుడు గణేష్ రాయడు క్రీడాకారులకు రూ.15 వేల విలువైన దుస్తులు, సామగ్రి అందజేశారు. క్రీడలు ఆడిన అన్ని రోజులు పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమన్ని జెడ్‌పిటిసి దాసరి శ్రీలక్ష్మి, సర్పంచి అనంతలక్ష్మి ప్రారంభించి ఆడుదాం ఆంధ్రా ప్రాధాన్యతను వివరించారు.

భీమడోలు : మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైనా బుధవారం కబడీ పోటీలు నిర్వహించినట్లు ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి తెలిపారు. కబడీ పోటీల నిర్వహణకు ఎంపిక చేసిన నాలుగు క్రీడా మైదానాల్లో 28 జట్లు పాల్గొనగా, 18 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు, పూళ్ల క్రీడా మైదానాల్లో ఆరేసి జట్లు వంతున, గుండుగొలను, ఆగడాలంక క్రీడా మైదానాల్లో మూడేసి జట్లు వంతున పాల్గొన్నాయని తెలిపారు. పోటీలను ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు తిలకించారన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

భీమడోలు : ప్రభుత్వం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు కోరారు. మండలంలో పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో జిల్లా ఉపాధ్యక్షులు కెఎంజి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి కెవివి.సుబ్బారావు, భీమడోలు మండల శాఖ అధ్యక్షులు మండే సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరిగిన ఆర్థిక నష్టాన్ని 12వ పిఆర్‌సిలో మెరుగైన మధ్యంతర భృతిని ప్రకటించడం ద్వారా భర్తీ చేయాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ముదినేపల్లి : నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఏలూరు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు అన్నారు. కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జి ఆధ్వర్యంలో బుధవారం మండలంలో ఆయన పర్యటించారు. ముదినేపల్లి మండల అధ్యక్షులు గోళ్ల రాజ్ కుమార్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం ముదినేపల్లిలో సమస్యలు పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం తొలిత పోలాకి అప్పారావు, సన్నక సత్యనారాయణలకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండుబోయినా చంద్రశేఖర్, బిసి సెల్ సిటీ అధ్యక్షులు నాగమల్లేస్వరరావు, మంతెన బ్రదర్స్ పాల్గొన్నారు.

ముగియనున్న షష్ఠి ఉత్సవాలు

ముదినేపల్లి : జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారంతో ఈ ఉత్సవాలు 11వ రోజు చేరాయి. ఉత్సవాలు రెండు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో భక్తుల తాకిడి అధికమైంది. శని, ఆది, సోమవారాలు వరుస సెలవులు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుట్టలో పాలు పోశారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్త జనంతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని పలు ఆర్‌టిసి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు సింగరాయపాలెం నడుపుతున్నారు. ఈనెల 29వ తేదీ శుక్రవారం జరిగే అఖండ అన్న సమారాధనతో స్వామివారి షష్ఠి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ముగియనున్నాయి.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

చింతలపూడి : తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు రావలసిన డిఎ బకాయిలు, పిఆర్‌సి, ఏరియర్లు, ఎపిజిఎల్ఐ, పిఎఫ్ లోన్లు, బకాయిలు పడ్డ వేలాది కోట్ల రూపాయల అమౌంట్లను విడుదల చేసి ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక అవసరాలు తీర్చాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తాలూకా డివిజన్ స్థాయి ఆరు గంటల ధర్నా కార్యక్రమం కలెక్టరేట్ వద్ద నిర్వహించారు. డివిజన్ కన్వీనర్, జిల్లా అధ్యక్షులు ముస్తాఫాలి నాయకత్వం వహించారు. జిల్లా సహాధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని ధర్నాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంకు జనవరి 3వ తేదీన 12 గంటల పాటు జిల్లాస్థాయిలో పెద్ద ఎత్తున ధర్నాలు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో 36 గంటల ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సుధారాణి శ్రీధర్, రాంబాబు, ఆడిట్ కన్వీనర్ మోహన్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి.నరసింహారావు, ఏలూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు 100 మందికి పైగా పాల్గొన్నారు.

చింతలపూడి : పిఎఫ్, ఎపిడిఎల్ఐ, పిఆర్‌సి, ఏరియర్స్ 1వ తేదీన జీతం చెల్లించాలని యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి డివిజన్ ఆధ్వర్యంలో యూటియఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ షకిలాకి వినతిని అందించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, సిపిఎస్ రద్దుచేసి, పిఆర్‌సి డిఎలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ మండల అధ్యక్షులు పురేటి శ్రీనివాసరావు, చెంచెంరాజు హేమ్లనాయక్, శ్రీనివాస్, రంగయ్య, రాము, శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కైకలూరు : ఉపాధ్యాయుల జీతాలు, బకాయిల చెల్లింపుకై కైకలూరు తాలూకా కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో కైకలూరు డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుంచి 60 మంది ఉపాధ్యాయులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ మురళీకృష్ణకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి సాగర్, జిల్లా కార్యదర్శి బేతాళరావు, రాష్ట్ర కౌన్సిలర్ రవిశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా శ్రీనివాస్, ప్రసన్నకుమారి, నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో సత్తా చాటిన కామవరపుకోట చిన్నారులు

కామవరపు కోట : పట్టణాల్లో ప్రముఖ నృత్య సంస్థల్లో తర్ఫీదు పొందిన వారితో సమానంగా మారుమూల పల్లె ప్రాంతం అయిన కామవరపుకోట చిన్నారులు మట్టిలో మాణిక్యాల వలె తమ ప్రతిభను చాటి చెప్పటం, వారిలో నృత్యం పట్ల ఉన్న అభిరుచిని తెలియజేస్తుందని ప్రముఖ సోషల్ వర్కర్ షేక్ ఇబ్రహీం అన్నారు. ఇటీవల ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో అభినయ నృత్య భారతి అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో కామవరపుకోటకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. స్థానిక స్రవంతి డాన్స్ ఇన్సిట్యూట్ ఆధ్వర్యంలో నృత్య శిక్షణ పొందిన పలువురు చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆలూరి రేణుకకు సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం, తోకల హారిక, గొర్రెల సౌజన్యలకు తృతీయ స్థానం, యార్లగడ్డ జస్విత ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారు. నిర్వాహకులు చిన్నారులకు జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ వివిధ నృత్య కళాకారిణిలతో పోటీలో పాల్గొనే విధంగా తమకు తర్ఫీదునిచ్చిన స్రవంతి టీచర్‌కు, ప్రోత్సాహం అందజేసిన షేక్ ఇబ్రహీం, తోకల రాజేష్‌కు చిన్నారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి

జంగారెడ్డిగూడెం : ఎర్రకాలువ ప్రాజెక్ట్ మిగులు భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని సిపిఎం మండల కమిటీ విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఆఫీసులో విద్యుత్ శాఖ డిఇ.రాధాకృష్ణకు వినతిని ఇచ్చి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు అధ్యక్షత వహించగా పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మించి గత 50 సంవత్సరాలు కావస్తుంటే, ప్రాజెక్టు మిగులు భూముల్లో అధికారుల అండదండలతో ఎ.పోలవరం తాడువాయి, వేగవరం, చక్ర దేవరపల్లి గ్రామాల్లోని భూస్వాములు అక్రమంగా ఆక్రమించి వందల ఎకరాల భూమిసాగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు గతంలో పలుమార్లు అక్రమ కనెక్షన్లు తొలగించాలని దరఖాస్తులు ఇచ్చినప్పటికీ అక్రమ కలెక్షన్లు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల సాగుకు కరెంటు మోటర్ కనెక్షన్ ఇమ్మంటే ప్రభుత్వం రూల్స్ ఒప్పుకోమని చెబుతున్న విద్యుత్ శాఖ అధికారులు గతంలో ప్రభుత్వం నిర్మూలించిన విద్యుత్ కనెక్షన్లు ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. తక్షణమే కనెక్షన్లు తొలగించాలని విద్యుత్ డిఎ రాధాకృష్ణకు తెలియజేయగా స్పందించి, తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని, అక్రమ కనెక్షన్లు తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. లేనిపక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అప్పటికి పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణ ఉద్యమాలు నిర్వహిస్తామని, విద్యుత్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీసభ్యులు గరికి రాంబాబు, జి.సూర్యకిరణ్, లక్క బత్తుల వెంకన్న, పి.దుర్గారావు, వామిశెట్టి నరసరావు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో సేవలందించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రోగులపై కరుణ, ప్రేమ చూపుతూ సానుకూల దృక్పథం, అంకితభావంతో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి అధ్యక్షతన 26వ బ్యాచ్ రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినుల క్యాప్ ప్రధానోత్సవంలో కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రసన్న వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సింగ్ విద్య పూర్తి చేసుకుని రోగులకు సేవలందించేందుకు తొలి అడుగులు వేస్తున్న విద్యార్థులు చాలా బాధ్యతగా అందరికీ సమానత్వంతో సేవలందించాలన్నారు. కోవిడ్ సమయంలో నర్సులు అందించిన సేవలు మరువలేమన్నారు. నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఉద్యోగాలు పొంది ఉన్నత స్థితిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీలో డయాలసిస్ సెంటర్‌కు డయాలసిస్ వైద్య పరికరాలను అందజేసిన దాతలను కలెక్టర్ అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన నర్సులకు క్యాప్‌లు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముందు నర్సింగ్ వత్తికి వన్నెతెచ్చిన ఫ్లోరెన్స్ నైటెంగిల్, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాట్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ భవనంలో డయాలసిస్, తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. తొలుత రెడ్‌క్రాస్ డయాలసిస్ సెంటర్‌ను రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన లిఫ్టును, మినరల్ వాటర్ ప్లాంట్‌ను, విస్తరించిన రెడ్‌క్రాస్ మెడికల్ స్టోర్‌ను, డ్రింకింగ్ మినరల్ వాటర్ సర్వీసును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డయాలసిస్ వైద్య పరికరాలను విరాళంగా అందించిన వివి.హనుమంతరావు, వి.సుబ్బలక్ష్మి దంపతులను, కాకరాల రాజా, అమ్మాజీలను కలెక్టర్ సత్కరించారు. రెడ్‌క్రాస్ ద్వారా సేవలందిస్తున్న వి.చిట్టిబాబు, మానవత ఎ.నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ వైద్యాధికారి డాక్టర్ జెవి.ప్రసాద్‌రెడ్డి, రాష్ట్రపతి అవార్డుగ్రహీత ఎం.ఝాన్సీ రాణి, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలను సత్కరించారు. పలువురికి మెమెంటోలు అందజేశారు.

ప్రతి వ్యక్తీ వినియోగదారుడే : జెసి

ఏలూరు : సమాజంలో ప్రతి వ్యక్తి వినియోగదారుడే అని, ప్రతి వ్యక్తి నాణ్యమైన, సరసమైన ధరలకు వస్తువులు పొందే హక్కు కలిగి ఉన్నారని, ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య తెలిపారు. కలెక్టరేట్ కాంపౌండ్ ఆవరణలో బుధవారం ఉదయం గోదావరి ఫంక్షన్ హాల్‌లో వినియోగదారుల దినోత్సవం జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లావణ్యవేణి మాట్లాడుతూ వినియోగదారులు కొన్న ప్రతి వస్తువు నాణ్యతను పరిశీలించాలన్నారు. కొన్న ప్రతి వస్తువుకు బిల్లులు పొందాలన్నారు. వినియోగదారుల రక్షణకు సంబంధించిన విషయాలు న్యాయవాది, కాన్ ఫెడరేషన్ ఆఫ్ జిల్లా కన్స్యూమర్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్ కట్టా సత్యనారాయణ సదస్సులో పాల్గొన్న వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కె.రామచంద్రరావు, సిఎపిఎస్.రామానుజాచార్యులు, బంగారు రాజు, డాక్టర్ విజయకృష్ణ వినియోగదారుల అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహించి సేవలు అందించిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులను జెసి లావణ్య వేణి సత్కరించి, మెమొంటోలు అందజేశారు. స్కూల్స్, కాలేజీల్లో పోటీ పరీక్షలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు క్యాష్ ప్రైసెస్ వేదికపై జెసి బహుమతులు అందజేశారు.

ఆయుష్ హాస్పిటల్ వైద్యంపై విచారణ జరపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు అర్బన్ : ఏలూరు ఆయుష్ హాస్పిటల్‌లో జరిగిన అరాచకం, అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనుభవం లేని వైద్యులతో వైద్యం చేయించి, బాధిత మహిళకు మూడు రోజులు వైద్య చికిత్స చేస్తున్నామని నమ్మబలికి లక్షలు దోచుకున్నారని పత్రికల్లో రావడం దురదృష్టకరమన్నారు. అసమర్థ వైద్యులను పెట్టి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాల మీదకి తెస్తున్న ఇలాంటి ఆసుపత్రుల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సదరు ఆసుపత్రికి అనుమతులు ఉన్నాయా? లేక అనధికారికంగా రాజకీయ నాయకుల అండదండలతో నిర్వహిస్తున్నారా? అనే పలు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విధంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రులపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయాలని రవి డిమాండ్ చేశారు.

ఉచిత బస్సు సేవలు వద్దని ఆటో డ్రైవర్లు ర్యాలీ

జంగారెడ్డిగూడెం : ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సర్వీసు ప్రకటించడం ఉపసంహరించుకోవాలని పట్టణ, మండల ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లు నిరసన తెలిపారు. బుధవారం బుట్టాయగూడెం రోడ్డు నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం మా పొట్ట కొడుతుందన్నారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిని అందించారు.

పేదలకు చీరల పంపిణీ

ముదినేపల్లి : జగనన్న శారద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మండలంలోని పెదపాలపర్రు శివారు చినప్రత్తిపాడులో బుధవారం పేద మహిళలకు 200 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న శారద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తిరువీధుల శారద మాట్లాడుతూ నియోజకవర్గంలో పండుగలను పురస్కరించుకొని పలు గ్రామాల్లో లక్ష చీరలు పంపిణీ చేస్తామన్నారు.

కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

మండవల్లి ఎస్ఐగా రామచంద్రరావు

మండవల్లి : మండవల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా సిహెచ్ఎస్.రామచంద్రరావు బుధ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన బదిలీల్లో భాగంగా భీమవరంలో ఎస్ఐగా పనిచేస్తున్న రామచంద్రరావును మండవల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన రామకృష్ణ రాజమండ్రి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించే అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానన్నారు.

బిసి సెల్ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజుగౌడ్

కైకలూరు : కాంగ్రెస్ బిసి సెల్ జిల్లా అధ్యక్షుడిగా కట్టా నాగరాజు గౌడ్ ఎన్నికైయ్యారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు నియామక పత్రాన్ని నాగరాజ్ గౌడ్‌కు అందజేశారు. నాపై నమ్మకంతో బిసి విభాగం బాధ్యతలు అప్పగించినందుకు తగిన సేవ చేసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని నాగరాజు గౌడ్ తెలిపారు.

భీమడోలులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

భీమడోలు : ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారంతో 266వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ భీమడోలు గ్రామపంచాయతీ, నెంబరు-2 గ్రామ సచివాలయం పరిధిలోని బిసి కాలనీలో బుధవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానీరంగా, మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షురాలు సునీత మాన్సింగ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు ఎంఎల్ఎను సాదరంగా ఆహ్వానించారు.

జంగారెడ్డిగూడెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

జంగారెడ్డిగూడెం : అభివృద్ధిని అందించే చంద్రబాబు పాలనకు పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి చింతలపూడి నియోజకవర్గ అబ్జర్వర్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణ టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చింతలపూడి మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తా రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, టిడిపి నాయకులు బొబ్బర్ రాజ్‌పాల్ కుమార్, నంబూరి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

చాట్రాయి : మండలంలోని సూరంపాలెం గ్రామం యువకులకు నూజివీడు నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య ఆర్థిక సహాయంతో క్రికెట్, వాలీబాల్ కిట్లు బుధవారం గ్రామ పెద్దలు ములగలపాటి శ్రీనివాసరావు చేతులు మీదగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దారా సుందర రావు, రాజ, హరీష్, చంటి, షతీష్, కృష్ణారావు, అభి, చెన్నారావు, గోపి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ELURU
O.S.No. 114/2021
Between :
Smt. Lakshmipathula Padmavathi - Plaintiff
And
Jakkula Anil Babu & others - Defendants
To
D-2: Jakkula Ashok Babu, S/o. Venkateswara Rao, D.No.16A-6-33A, 50th Division, Tangellamudi, Eluru, Eluru District
D-3: Jakkula Anitha, W/o. Yugandhar, D.No. 16A-6-33A, 50th Division, Tangellamudi, Eluru, Eluru District
పై నెంబరు దావా గ్రంథములో శ్రీ కోర్టు వారు ప్రతివాదులు 2,3 వారల హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక యాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం ది.2-1-2024వ తేదీన ఉదయం గం.10-30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు కానీ యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంథము పరిష్కరింపబడునని తెలియజేయడమైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
G.V.Anand Kumar, B.Sc., B.L.,
Advocate, Eluru, Cell : 9848427001

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఐ.ఎ. 1/2023 ఇన్ ఓ.ఎస్.నెం. 7/2021
బిట్వీన్ :
1. కోరా రామారావు&ఇతరులు ...పిటీషనర్లు/వాద్లు
మరియు
1. గుణ్ణం భాగ్యలక్ష్మి (డైడ్) & ఇతరులు - రెస్పాండెంట్లు / ప్రతివాద్లు
ప్రపోజ్డు పార్టీలు:
1). పువ్వాడ సత్యనారాయణ, వేల్పూరు గ్రామం (ఆర్-4)
2). పువ్వాడ సురేష్, s/o. సత్యనారాయణ, వేల్పూరు గ్రామం (ఆర్-5)
వాదుల తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన
పై నెంబరు గ్రంథంలో ప్రతివాద్లు (ప్రపోజ్డు పార్టీలు) అయిన మీకు పై పిటీషన్‌లో నోటీసులు శ్రీ.కోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించినసూ, అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట ది.9-1-2024వ సం.రం. తేదీన ఉదయం గం.10-30 ని॥లకు హాజరు కావలెను. మీరు స్వయంగా కానీ మీ తరపు ప్లీడరు గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
తణుకు ఇట్లు
తేది : 26-12-2023
ఇవటూరి కిషోర్
డి. హెచ్.ఆర్.తరపున అడ్వకేట్
సెల్: 98485 44550